15 రోజుల్లో కోనేరు అభివృద్ధి పనులు పూర్తిచేయాలి

- ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే)
- పనులు పరిశీలన

మంగళగిరి: నగరంలోని లక్ష్మీనృసింహస్వామి ఆలయానికి చెందిన పెదకోనేరు(పుష్కర కళ్యాణి) అభివృద్ధి పనులు 15 రోజుల్లో పూర్తిచేసి భక్తులకు అందుబాటులోకి తీసుకువస్తామని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) తెలిపారు. పెదకోనేరులో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎమ్మెల్యే మంగళవారం పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పూర్వం లక్ష్మీనృసింహస్వామి తెప్పోత్సవం జరిగే కోనేరు కాలక్రమేణ శుభ్రత లోపించి పిచ్చిమొక్కలతో తయారైందన్నారు. ఈ నేపథ్యంలో కోనేరు అభివృద్ధికి చేపట్టిన పనులు త్వరలోనే పూర్తి కానున్నాయన్నారు. ఇప్పటికే తుది దశకు పనులు చేరుకోగా కోనేరులో పేరుకుపోయిన పూడిక తీసేందుకు అత్యాధునిక మిషన్లు ఏర్పాటు చేయాల్సి రావడం కారణంగానే ఆలస్యం అయిందన్నారు.


పెదకోనేరు అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే)

రూ.4.50 కోట్లతో నగరంలో శ్మశానవాటికల అభివృద్ధి

నగరంలోని ఆయా ప్రాంతాలలో ఉన్న శ్మశానవాటికలలో రూ.4.50 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని ఎమ్మెల్యే ఆర్కే చెప్పారు. నగర పరిధిలోని రూ.45 లక్షలతో చేపట్టిన పెదవడ్లపూడి ముస్లిం బరేలి గ్రౌండ్‌తోపాటు బాపనయ్యనగర్‌లో రూ.25లక్షలతో చేపట్టిన విశ్వబ్రాహ్మణులు శ్మశానవాటిక అభివృద్ధి పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. నవులూరులో క్రిస్టియన్, ముస్లిం శ్మశానవాటికలు, మిద్దె సెంటర్‌లోని శ్మశానవాటికలలో జరుగుతున్న అభివృద్ధి పనులు పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ దశాబ్దాలుగా శ్మశానవాటికలను ఎవరు పట్టించుకోకపోవడంతో కంపచెట్లు పెరిగి చిట్టడవులను తలపిస్తున్నాయన్నారు. శ్మశానవాటికలోకి మృతదేహం తీసుకెళ్లాలన్నా అంత్యక్రియలు నిర్వహించాలన్నా తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో రూ.4.50 కోట్లతో అన్ని శ్మశానవాటికలను అభివృద్ధి పరచి అంత్యక్రియలు, కర్మక్రియలకు అవసరమైన అన్ని మౌలికవసతులు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నగర పాలక సంస్థ డీఈఈ కృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వితంతువులకు నిత్యావసరాలు పంపిణీ

మంగళగిరి: నగరంలోని రత్నాలచెరువు, ఇందిరా నగర్ ప్రాంతాలకు చెందిన నిరుపేద వితంతు మహిళలకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) రెండు నెలలకు సరిపడా బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు.

రత్నాల చెరువుకు చెందిన ఉన్నం యశోద, దొడ్డిపాళ్ల రామలింగమ్మ, గోలి సామ్రాజ్యం, ఇందిరానగర్‌కు చెందిన బూదాటి రాజేశ్వరిలకు వివిధ కారణాలతో భర్తలు మృతి చెందగా పేదరికంతో ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆర్కే నిత్యావసర సరుకులు అందజేయగా మంగళవారం పార్టీ పట్టణ మహిళా అధ్యక్షురాలు సంకె సునీత, కార్యదర్శి మల్లవరపు సుధారాణి, పార్టీ నాయకులు వ్యాసం అజయ్, బూదాటి రవి, బియ్యం శ్రీను పాల్గొన్నారు.


విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

ఎమ్మెల్యే చొరవతో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

మంగళగిరి: ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) చొరవతో 24 గంటల్లోనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేశారు. దీనిపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నగర పరిధిలోని పార్కు రోడ్డులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మంగళవారం మరమ్మతులకు గురికావడంతో సరఫరా నిలిచిపోయింది. స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే వెంటనే కొత్తదిఏర్పాటు చేసి సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్‌శాఖ అధికారులకు సూచించారు. స్పందించిన విద్యుత్ శాఖ ఈఈ విజయ్‌కుమార్, డీఈఈ అక్కల సత్యనారాయణ ఆధ్వర్యంలో సిబ్బంది 24 గంటలలోనే నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. విద్యుత్ సరఫరా పునరుద్ధించారు. ఎమ్మెల్యే ఆర్కేకి ధన్యవాదాలు తెలియజేశారు.

ప్రతి కుటుంబానికీ మేలు జరిగింది

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త సురేష్‌కుమార్
- మోతడక గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం



మోతడక(తాడికొండ): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి మేలు జరిగిందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. తాడికొండ మండలం మోతడక గ్రామంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన ఇంటింటికి తిరిగి 4 సంవత్సరాలలో జరిగిన లబ్ధిని వివరించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పెద్దఎత్తున సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ప్రభుత్వాలకు భిన్నంగా గ్రామాలకు సేవలు చేరువ చేశారన్నారు. వృద్ధులు, వికలాంగులు గతంలో పింఛన్‌లు కావాలంటే ఎదురుచూపులు చూసేవారని, కానీ నేడు అందుకు భిన్నంగా ఒకటో తేదీనే ఇంటి వద్దకు వలంటీర్ వెళ్లి అందిస్తున్నారంటే జగనన్న పారదర్శక పాలనకు నిదర్శనమన్నారు. రాష్ట్రంలో టీడీపీ నాయకులు ప్రభుత్వంపై బురదచల్లి లబ్ధి పొందాలని చూస్తున్నారని, కానీ ప్రజలు మాత్రం బాబును ఎప్పటికీ నమ్మరని గుర్తుంచుకుంటే మంచిదన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బండ్ల పున్నారావు, ముఖ్య నాయకులు తాళ్ల శివనాగరాజు, నిడుముక్కల సర్పంచ్ మాదాసు రత్నకుమారి, స్థానిక నాయకులు వెంకటయ్య మాస్టారు, నిమ్మగడ్డ రాజేంద్ర ప్రసాద్, బోయపాటి సాంబశివరావు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని ఆరవ వార్డులో సొరియాసిస్ వ్యాధితో బాధపడుతున్న ఓ వ్యక్తికి ఎమ్మెల్యే ఆర్కే మంగళవారి రాత్రి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ ఆర్థిక సహాయాన్ని 6వ వార్డు మాజీ కౌన్సిలర్ వేముల లక్ష్మీరోజా బాధితుడు షేక్ నాగుర్‌వలి ఇంటికి వెళ్లి ఎమ్మెల్యే అందజేసిన రూ.20 వేలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఉప్పు శ్రీనివాసరావు, వేముల కోటేశ్వరరావు, అంబారావు, కొండలు, వలంటీర్ తురిమెళ్ల శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సీసీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



ఫిరంగిపురం: మండలకేంద్రంలోని వసంతనగర్‌లో సీసీరోడ్డు నిర్మాణానికి జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ మంగళవారం శంకుస్థాపన చేశారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం సచివాలయానికి రూ.20 లక్షలు కేటాయించిందని చెప్పారు. దానిలో భాగంగా రూ.7లక్షలతో వసంతనగర్ రైల్వేగేటు వద్ద నుండి వెంకట్రావు ఇంటివరకు సీసీరోడ్డు నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మేడా బాబు, కె.చిన్నప్పరెడ్డి, బి.అంజిరెడ్డి, పాలపాటి రఘు, రంజన్‌బాబు, ఇజ్రాయిల్, శౌరిరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా స్నాతకోత్సవ వేడుకలు



మంగళగిరి: నగర పరిధిలోని ఆత్మకూరు జాతీయరహదారి పక్కన ఉన్న నిర్మల సీబీఎస్ఈ పాఠశాలలో మంగళవారం యూకేజి విద్యార్థులకు స్నాతకోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో చిన్నారులు చేసిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులకు స్నాతకోత్సవం సందర్భంగా పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సెక్రటరీ సిస్టర్ మరియసుందరి, కరస్పాండెంట్ సిస్టర్ జాన్‌పాల్, ప్రిన్సిపల్ శిరీషరాణి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గృహనిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేయండి

ఫిరంగిపురం: జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను లబ్ధిదారులు త్వరితగతిన పూర్తిచేయాలని ఇంజినీరింగ్ అసిస్టెంటు రియాజ్ అన్నారు. మండలంలోని వేమవరంలో జగనన్న కాలనీల గృహ నిర్మాణ లబ్ధిదారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. సమావేశానికి ప్రత్యేకాధికారి, ఈవోపీఆర్డీ నిర్మలలక్ష్మీకుమారి హాజరై మాట్లాడారు. గ్రామంలో మూడు లేఅవుట్‌లు 27మంది లబ్ధిదారులు ఉండగా 11మంది మాత్రమే గృహనిర్మాణాలు మొదలు పెట్టారని వాటిలో ఆరు గృహనిర్మాణాలు పూర్తి అయ్యాయని చెప్పారు. మిగిలిన గృహాల లబ్ధిదారులు ముందుకు వచ్చి నిర్మాణాలు మొదలు పెట్టాలని వారికి అవసరమైన మెటీరియల్ గృహనిర్మాణశాఖ అధికారులు అందజేస్తారన్నారు. సమావేశంలో కార్యదర్శి జీవీఆర్‌కేమూర్తి, గృహ నిర్మాణ లబ్ధిదారులు పాల్గొన్నారు.

సచివాలయంలో ఆధార్ సేవలు

ఫిరంగిపురం: మండలంలోని యర్రగుంట్లపాడు గ్రామంలోని సచివాలయం వద్ద మంగళవారం ఏర్పాటుచేసిన ఆధార్ నమోదు కేంద్రంలో 12మంది మార్పులు, చేర్పులు చేయించుకున్నట్లు ఎంపీడీవో డి.అనూరాధ తెలిపారు. కీలకమైన ఆధార్ కార్డులో మార్పులు, చేర్పులు సరిచేయించుకునేందుకు ప్రజలకు అందుబాటులో ఉండేలా ఏర్పాటుచేశామన్నారు. మూడు రోజుల పాటు యర్రగుంట్లపాడులో ఆధార్ సేవలు అందిస్తారని 26, 27వ తేదీల్లో 113 తాళ్లూరులో ఆధార్ సేవలు అందించనున్నట్లు తెలిపారు. బయోమెట్రిక్ అప్‌డేట్‌కు ఆరుగురు, జనన తేదీ, అడ్రసు మార్పునకు మరో ఆరుగురు వచ్చినట్లు ఆమె వివరించారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

మంగళగిరి: నగర పరిధిలోని తాడేపల్లిలో గల ఐటీసీ కంపెనీలో మంగళవారం అగ్ని ప్రమాదాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాలు జరిగిన సమయంలో మంటల నుంచి ఎలా తప్పించుకోవాలో, ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో, అగ్నిప్రమాదాల్లో గాయపడిన వారిని ఎలా రక్షించాలి? వారికి ఎలాంటి చికిత్స అందించాలనే అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మంగళగిరి అగ్నిమాపక శాఖ అధికారి వెంకటేశ్వరరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీని తరిమికొడదాం

సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు

తాడేపల్లిరూరల్: దేశాన్ని కార్పొరేట్ సంస్థలకు దోచిపెడుతున్న బీజేపీ ప్రభుత్వాన్ని తరిమికొట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు అన్నారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని సుందరయ్యనగర్‌లో మంగళవారం సీపీఎం, సీపీఐ ఆధ్వర్యాన ప్రచార భేరి నిర్వహించారు. రామారావు మాట్లాడుతూ బీజేపీ పూర్తిగా కార్పొరేట్లకు దాసోహం అయిందని, దేశాన్ని అదాని లాంటి వారికి తాకట్టు పెడుతోందని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తోందని మండిపడ్డారు. ఒకే దేశం ఒకే భాష, ఒకే విద్య, ఒకే పన్ను విధానాన్ని బలవంతంగా రుద్దుతోందని అన్నారు. సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి కంచర్ల కాశయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సామాన్యులపై మోయలేని భారాలు మోపుతుందని అన్నారు. ప్రచార భేరి ముగింపు సందర్భంగా ఏప్రిల్ 24న మంగళగిరిలో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు, రూరల్ మండల కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి, నాయకులు కొట్టే కరుణాకరరావు, వేముల దుర్గారావు, సోలా ముత్యాలరావు, దొంతిరెడ్డి విజయ భాస్కర్ రెడ్డి, యనమాల బర్నబాస్, కె.ఉషారాణి, కట్టా మేరి, ఏషియా, సీపీఐ నాయకులు తుడిమెల వెంకటయ్య, మానికొండ డాంగే, మునగాల రామారావు తదితరులు పాల్గొన్నారు.


ప్రచారభేరి యాత్రలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు

ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలి

- అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ వి.రాజేష్
- ఓఆర్ఎస్ ద్రావణం పంపిణీ

మంగళగిరి: వేసవిలో ప్రతి ఒక్కరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి వి రాజేష్ అన్నారు. మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని యర్రబాలెం శివాలయం సెంటర్‌లో డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రజలకు ఓఆర్ఎస్ ద్రావణాన్ని పంపిణీ చేశారు. డాక్టర్ రాజేష్ మాట్లాడుతూ బాటసారులు, వాహనదారుల దాహార్తిని తీర్చేందుకు స్థానిక యువత వేసవి చలివేంద్రం ఏర్పాటు చేయడం ఎంతైనా అభినందనీయమన్నారు. ఎండాకాలం ప్రతి ఒక్కరి శరీరాల్లో ఎన్నో మార్పులు సంభవిస్తుంటాయని, శరీరంలో ఖనిజ లవణాలు తగ్గినప్పుడు శరీర ఉష్ణోగ్రత పెరిగి వణుకు పుట్టడం వంటి లక్షణాలు మొదలవుతాయన్నారు. అటువంటి వారికి వెంటనే ఓఆర్ఎస్ ద్రావణాన్ని అందిస్తే వెంటనే యథాస్థితికి వస్తారన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి కె లక్ష్మీమనోహర్, ఆశా కార్యకర్తలు జి లక్ష్మీప్రసన్న, టి.జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.


వేసవి చలివేంద్రం వద్ద ఓఆర్ఎస్ ద్రావణాన్ని పంపిణీ చేస్తున్న డాక్టర్ వి రాజేష్ తదితరులు

మజ్జిగ పంపిణీ

వేసవి చలివేంద్రం వద్ద మూడో రోజు మంగళవారం మజ్జిగ పంపిణీ కార్యక్రమం కొనసాగింది. యర్రబాలెంకు చెందిన పెద్దిశెట్టి పిచ్చేశ్వరరావు జ్ఞాపకార్థం కుటుంబ సభ్యుల సహాయ సహకారాలతో బాటసారులకు, వాహనదారులకు 100 లీటర్ల మజ్జిగను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గుండాల సాయి, నాయుడు రాజీవ్, కాపరౌతు సుందరయ్య, తదితరులు పాల్గొన్నారు.

బాలోత్సవం ఆధ్వర్యంలో మ్యాజిక్‌లో శిక్షణ

తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి బాలోత్సవం ఆధ్వర్యంలో మే ఐదు నుంచి 14వ తేదీ వరకు మ్యాజిక్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు బాలోత్సవం ఉపాధ్యక్షులు జీఎస్ఆర్ మోహనరావు తెలిపారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని ఓ పాఠశాలలో మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ వేసవి సెలవులను మ్యాజిక్ నేర్చుకోవడానికి వినియోగించుకోవాలని విద్యార్థులకు సూచించారు. మ్యాజిక్ నేర్చుకోవడం వల్ల పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని అన్నారు. కోశాధికారి గాదె సుబ్బారెడ్డి మాట్లాడుతూ మ్యాజిక్ రంగంలో ప్రపంచ రికార్డు సృష్టించిన ప్రఖ్యాత ఇంద్రజాలికులు క్రాంతికుమార్ ప్రత్యేక పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. ప్రతి రోజూ ఉదయం 7.30 నుంచి 9 గంటల వరకు ఈ శిక్షణా తరగతులు నిర్వహిస్తామని, మ్యాజిక్‌లో శిక్షణ పొందగోరే వారు వెయ్యి రూపాయలు రుసుం చెల్లించాలని అన్నారు. పాల్గొనే విద్యార్థులు ముందుగా తమ పేర్లు 6301217365, 9866029486 నెంబర్లకు ఫోన్ చేసి నమోదు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం కార్యదర్శి కె.శ్రీలక్ష్మి, పలు విద్యాసంస్థల ప్రధానోపాధ్యాయులు, బాలోత్సవం నిర్వాహకులు బిట్రా రామారావు తదితరులు పాల్గొన్నారు.


బ్రోచర్ విడుదల చేస్తున్న తాడేపల్లి బాలోత్సవం సభ్యులు

జగనన్నే మా భవిష్యత్‌కు విశేష స్పందన

మంగళగిరి: నగర పరిధిలోని పలు వార్డుల్లో మంగళవారం నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. పార్టీ నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు, గృహసారథులు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో ఇచ్చిన ప్రశ్నలకు ప్రజల నుంచి సమాధానాలు సేకరించి నమోదు చేశారు. నగరంలోని 8వ వార్డులో జరిగిన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి ఇంటింటికి తిరుగుతూ జగనన్న పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించి ప్రజల మద్దతు కోరి వారి ఇంటికి స్టిక్కర్లు అంటించారు. నగర పరిధిలోని ఆత్మకూరు, కాజ, నిడమర్రు, చినకాకాని, పెదవడ్లపూడి, కురగల్లు, యర్రబాలెం, నవులూరులో ఆయా ప్రాంతాల నాయకులు, కార్యకర్తలు జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించి ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలను వివరించి ప్రజా మద్దతు కోరారు.


8వ వార్డులో ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి

97మందికి వైద్య పరీక్షలు

ఫిరంగిపురం: ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మాస్క్ ధరించాలని నుదురుపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి యానిగ్రేస్ అన్నారు. మండలంలోని వేములూరిపాడు గ్రామంలో మంగళవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, సాధారణ వ్యాధిగ్రస్తులు 97మందికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అనంతరం అంగన్‌వాడీ సెంటర్లలో చిన్నారులకు హెచ్‌బీ పరీక్షలు చేసి రక్తహీనత ఉన్న వారిని గుర్తించారు. యానిగ్రేస్ మాట్లాడుతూ వేసవి కాలం కావడంతో బయటకు వెళ్లే వారు తప్పనిసరిగా తలపై వస్త్రం ధరించాలని, గంటకోమారు నీరు, కొబ్బరి నీరు, పండ్లరసాలు తీసుకోవాలని సూచించారు. గర్భిణులు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలన్నారు. రక్తహీనత ఉంటే అనారోగ్యం చేకూరుతుందని దాని నివారణకు ఆకుకూరలు తీసుకోవాలన్నారు. ఆయా గ్రామాల్లో అంగన్‌వాడీ సెంటర్లు, హెల్త్ వెల్‌నెస్ సెంటర్లలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. రక్తహీనత నివారణకు గర్భిణులకు ఐరన్ సిక్రోజు ఇంజెక్షన్ రూపేనా అందజేస్తామని తెలిపారు. గర్భిణులకు ఎరుపురంగు, చిన్నారులకు 10నుండి 19 ఏళ్లవారికి బ్లూరంగు, 5నుంచి ఆరేళ్ల వారికి పింక్ రంగు ఐరన్ మాత్రలు అందజేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో హెచ్‌వీ నూర్‌ఖాజాబీ, ఎంఎల్‌హెచ్‌పీ స్వప్న, ఎంపీహెచ్ఏ బాబురావు, ఏఎన్ఎం అంతోనిరాణి, కంప్యూటర్ ఆపరేటర్ విజయ్, సింగరాజు, ఆశాకార్యకర్తలు సుజాత, పద్మ, శాంతరాణి, శాంతకుమారి, జోజమ్మలు పాల్గొన్నారు.


పరీక్షలు చేస్తున్న నుదురుపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి యానిగ్రేస్

వైఎస్సార్ సీపీ పాలనలో రాష్ట్రం సుసంపన్నం

జెడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా


కరపత్రాలు అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా

మేడికొండూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలనలో రాష్ట్రం సుసంపన్నం అని గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అన్నారు. మండలంలోని పేరేచర్లలో మంగళవారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ప్రతి ఇంటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఏవిధంగా లబ్ధి చేకూరాయనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. హెనీక్రిస్టినా మాట్లాడుతూ ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. ప్రతి ఇంటికి ప్రభుత్వ ఫలాలు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. రానున్న ఎన్నికల్లో ప్రజలందరి ఆశీర్వాదం కావాలని అన్నారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంచారు. కార్యక్రమంలో ఎంపీపీ మన్నవ స్వప్నరాజేష్, మండల కన్వీనర్ తాళ్లూరి వంశీకృష్ణ, మండల సచివాలయాల కన్వీనర్ షేక్ అబ్బాస్, కోకి అర్జునరావు, ముత్యాల బాలస్వామి, సుభాని, శివ పాల్గొన్నారు.

సొంత ఖర్చులతో ఈద్గాకు మెరక

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం తుమ్మపూడిలో ఉన్న ఈద్గా దగ్గర ప్రార్థనలు నిర్వహించుకునేందుకు అనువుగా ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) సొంత ఖర్చుతో మంగళవారం గ్రావెల్ మెరక తోలించారు. ఎమ్మెల్యేకి ముస్లింలు కృతజ్ఞతలు తెలిపారు.

టీడీపీ నాయకుల అత్యుత్సాహం

- సెల్ఫీలు దిగేందుకు ఉత్సాహం
- ఆందోళనకారులను అరెస్టు చేసిన పోలీసులు



తాడేపల్లిరూరల్: టీడీపీ నాయకులు అత్యుత్సాహం ప్రదర్శించారు. ఉండవల్లి క్వారీలో గ్రావెల్ అక్రమాలు జరుగుతున్నాయంటూ టీడీపీ నాయకులు మంగళవారం ఆందోళనకు దిగారు. క్వారీలో నుంచి ఎక్కడికి అక్రమ రవాణా జరుగుతోందో, ఎలా జరుగుతోందో చెప్పకుండానే వచ్చిన నాయకులు వైఎస్సార్‌సీపీని విమర్శిస్తూ, సెల్ఫీలు దిగి ప్రచారం చేసుకునేందుకు ఉత్సాహం చూపారు. అనుమతులు ఉన్నాయని చెప్పే ప్రయత్నం చేస్తున్నప్పటికి వారి మాట వినకుండా వారిని సైతం దొంగల్లా చిత్రీకరించడంతో సహనం కోల్పోయిన అధికారులు అన్ని అనుమతులు ఉన్నాయని పోలీసులకు చెప్పి అక్కడి నుంచి వచ్చేయడంతో ఆందోళన చేస్తున్న వారిని పోలీసులు అరెస్ట్‌చేశారు.

బత్తుల కిషోర్ కుటుంబానికి పరామర్శ

తాడికొండ: వైఎస్సార్ సీపీ తుళ్లూరు మండల మాజీ అధ్యక్షుడు బత్తుల కిషోర్ కుటుంబాన్ని మంగళవారం రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు పరామర్శించారు. కిషోర్ తండ్రి బత్తుల సుబ్బారావు ఇటీవల మరణించిన నేపథ్యంలో తుళ్లూరులోని కిషోర్ స్వగృహానికి విచ్చేసిన మందపాటి పరామర్శించి భరోసా చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.